క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి



తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణం 2వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేశారు. బైపాస్ రోడ్డులోని టవర్ రోడ్డు బజారులో కొండ్రుకాని నాగేశ్వర రావు ఇంటి వద్ద నుంచి గరికపాటి నాంచారమ్మ ఇంటి వరకు 150 మీటర్ల పొడవున 3.5 మీటర్ల వెడల్పున 10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, ఒకవైపు డ్రైయిన్ నిర్మాణం పూర్తిచేసినట్లు ఏఈ కిషోర్ తెలిపారు. ఈ కాలనీ ఏర్పడిన దగ్గర నుంచి రహదారి లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, డ్రైయిన్ నిర్మాణం చేసినట్లు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ సీజ్



మంగళగిరి: ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ లారీని మంగళగిరి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది సీజ్ చేసి రూరల్ పోలీసులకు అప్పగించారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం నుంచి మంగళగిరికి ఇసుక తరలిస్తున్న టిప్పర్ లారీని మార్గంమధ్యలోని యర్రబాలెం పొగాకు కంపెనీ వద్ద మంగళవారం సెబ్ సీఐ మారయ్యబాబు ఆదేశాల మేరకు సెబ్ ఎస్ఐ మల్లికార్జునరావు నేతృత్వంలో సిబ్బంది గోవింద్, హనుమంతు తనిఖీలు నిర్వహించారు. డ్రైవర్ వద్ద ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి డ్రైవర్‌తో మంగళగిరి రూరల్ పోలీసులకు అప్పగించగా రూరల్ ఎస్ఐ రమేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంగళగిరి రూరల్ ఎస్ఐగా జగన్‌మోహన్‌రావు


మంగళగిరి: మంగళగిరి రూరల్ ఎస్ఐగా బి జగన్‌మోహన్‌రావును నియమిస్తూ జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో మంగళగిరి రూరల్ ఎస్ఐగా విధులు నిర్వర్తించిన బి విజయ్‌కుమార్‌రెడ్డిపై పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో వీఆర్‌కు పంపారు. ఆయన స్థానంలో బి జగన్ మోహన్‌రావును మంగళగిరి రూరల్ ఎస్‌హెచ్‌ఓగా నియమిస్తూ ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే రెండవ రూరల్ ఎస్ఐగా రమేష్‌బాబు విధులు నిర్వర్తిస్తున్నారు.

తడిచిన పంటలను కొనుగోలు చేయాలని వినతి



తాడేపల్లిరూరల్: ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పసుపు, పెసర పంటలను కొనుగోలు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు డిమాండ్ చేశారు. దుగ్గిరాల డిప్యూటీ తహసీల్దార్ కళ్యాణికి మంగళవారం వినతిప్రతం అందజేశారు. బాలరాజు మాట్లాడుతూ పసుపు పంట కల్లాల్లో ఉండి తడిసిపోవడంతో దళారులకు తక్కువ ధరకు అమ్ముకుని రైతులు నష్టపోతున్నారని అన్నారు. పసుపు పంటకు కనీస మద్దతు ధర రూ.6,500 నిర్ణయించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి వై.బ్రహ్మేశ్వరరావు, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి ఎం.నాగమల్లేశ్వర రావు, రైతు సంఘం నాయకులు వి.సాంబశివ రావు, కె.కోటయ్య, బి.అమ్మిరెడ్డి, సిహెచ్ పోతురాజు, జి.శ్రీనివాసరావు, యల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులు పంపిణీ



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వేసవి సాగులో పాటించాల్సిన పద్ధతులు గురించి రైతులకు సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ ఉపసంచాలకుడు రామాంజనేయులు మాట్లాడుతూ పొలంలో పంట వ్యర్థాలను కాల్చివేయకుండా రోటోవేటర్ ద్వారా కలియదున్నాలని చెప్పారు. రైతులు మట్టి నమూనాలు సేకరించి రైతు భరోసా కేంద్రాల ద్వారా పరీక్షలు చేయించుకొని వాటి ఫలితాల ఆధారంగా ఎరువులు వాడుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు పచ్చిరొట్ట ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు ప్రవీణ, రాజామణి, ఏవో రమణకుమార్, విస్తరణాధికారి షేక్.సుభాని, మల్లికా గణేష్, రాంబాబు, శివారెడ్డి, కిరణ్, రైతులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే వైఎస్సార్ సీపీ లక్ష్యం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త సురేష్‌కుమార్
- మేడికొండూరులో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న కత్తెర సురేష్‌కుమార్

మేడికొండూరు: ప్రజలకు అన్నిరకాల ప్రభుత్వ సేవలు సచివాలయాల ద్వారా అందుబాటులోకి తీసుకు వచ్చి నేరుగా ఇబ్బందిపడకుండా అవసరాలు తీరుస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి దక్కుతుందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ, ప్రభుత్వం అందించే పలురకాల సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందుతున్న తీరు తెలుసుకునేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా ప్రవేశపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం మేడికొండూరు సచివాలయం-2 పరిధిలో నిర్వహించారు. కత్తెర సురేష్‌కుమార్ ఇంటింటికి వెళ్లి మహిళలతో మాట్లాడి స్థానికంగా ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలు పొందాలని తెలిపారు. అమ్మ ఒడి, చేయూత, ఆసరా పథకాలు సక్రమంగా అందుతున్నాయా అంటూ మహిళలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తామని అన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. గడిచిన నాలుగు సంవత్సరాల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని అన్నారు. విద్య, వైద్య రంగాలను ప్రక్షాళన చేసి సమూలమైన మార్పులు చేపట్టడం జరిగిందని అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కందుల సిద్ధయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్, మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బాజి, బి.వి సుబ్బారెడ్డి, ఆవుల సంజీవరెడ్డి, రాజేంద్రప్రసాద్, పాములపాటి జయరావు, ఎంపీటీసీ సభ్యులు కొలకలూరి నాగేశ్వరరావు, ముత్యాల బాలస్వామి, ఉడతా ప్రభాకర్, చంటి బాజి, మోతాన్ రమేష్, ఆరీఫ్, మిరియాల శివరామకృష్ణ, మన్నవ రాజేష్, నాగుల్ మీరా, మగ్బుల్, జానీబాషా, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కత్తెర సురేష్‌కుమార్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు, నాయకులు

చలివేంద్రం ప్రారంభం

మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల జంక్షన్‌లోని నరసరావుపేట రోడ్డులో గోకుల్ స్టూడియో ఎదురుగా ఉచిత మంచినీటి కూలింగ్ చలివేంద్రాన్ని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడూతూ వేసవి కాలంలో మంచి నీటి చలివేంద్రం ప్రజలకు, వాహనదారుల దాహార్తి తీర్చేందుకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కందుల సిద్ధయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న, ఉడతా ప్రభాకర్, మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, రసూల్, జంధ్రాసుపల్లి నాగేశ్వర రావు ,మన్నవ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

12న తాడికొండలో మేగా జాబ్‌మేళా

తాడికొండ: నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించి, వారి జీవితానికి బాటలు వేసేందుకు ఈనెల 12న తాడికొండలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం గుంటూరు భారత్‌పేటలోని నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సురేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ద్వారా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లా ఉపాధి కార్యాలయం, నైపుణ్యాభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ శాఖల ద్వారా ఈనెల 12న నిర్వహించనున్న జాబ్‌మేళా కరపత్రాలను ఆవిష్కరించారు. తాడికొండలోని భగవాన్ శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాల ఆవరణలో ఉదయం ఎనిమిది గంటల నుంచి ఎంపికలు నిర్వహిస్తామని, 15 బహుళజాతి కంపెనీలు పాల్గొంటున్నాయని, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. పది నుంచి బీటెక్ విద్యార్హత కలిగిన వారికి రూ.10వేలు నుంచి రూ.40వేల వరకు వేతనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పి.ప్రణయ్, పలువురు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక కిట్ల పరిశీలన

మేడికొండూరు: మేడికొండూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉన్న జగనన్న విద్యా కానుక కిట్లు నిల్వ చేసిన కేంద్రాన్ని ఆర్‌జేడీ సుబ్బారావు మంగళవారం తనిఖీచేశారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో ఉన్న స్కూళ్ల విద్యార్థులకు ఈ కిట్లు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచారు. ఆర్‌జేడీ సిబ్బందికి పలురకాల సూచనలు చేశారు. ప్రభుత్వ నిర్ధేశించిన సమయానికి జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేయాలని తెలిపారు. అన్ని పాఠశాలల్లో పూర్తికావలసిన పనులు నిర్ణీతమైన గడువు లోగా పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు ఎస్ వెంకటేశ్వర్లు, కె జయప్రద, మండల విద్యావనరుల కేంద్రం సిబ్బంది గంగయ్య, పలువురు సిబ్బంది, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు చేబ్రోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

చేబ్రోలు: చేబ్రోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం 11వ తేదీ ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ బి.బాబురావు మంగళవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కె.సాహితి అధ్యక్షతన గురువారం జరిగే సమావేశంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష, 2022-23 సాంవత్సరిక లెక్కలు తదితర అంశాలపై చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. మండలంలోని అందరూ ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులు హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

చినకోండ్రుపాడులో ఫ్యామిలీ ఫిజీషియన్

చినకోండ్రుపాడు (ప్రత్తిపాడు): ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కెజియాగ్రేస్ తెలిపారు. చినకోండ్రుపాడులో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ నిర్వహించారు. వైద్యాధికారులు 55 మంది రోగులను, గర్భిణులు, బాలింతలను పరీక్షించారు. వారికి వైద్య పరీక్షలు జరిపి మందులను అందజేశారు. అనంతరం గృహ సందర్శనలు జరిపి అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన చర్యలు, వ్యక్తిగత పరిశుభ్రతకు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా
- వార్డు సచివాలయాలు ప్రారంభం



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, మేయర్ కావటి మనోహర్‌నాయుడు

పట్నంబజారు: అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో ముందుకు తీసుకెళుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా తెలిపారు. మంగళవారం 14వ డివిజన్‌లోని నల్లచెరువు వాటర్ ట్యాంకుల వద్ద 57, 58 సచివాలయాలకు సంబంధించి నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడుతో కలిసి శాశ్వత భవనాలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పాలన దగ్గర చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. పేద ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి మంచి చేస్తేనే ఓటు వేయండని అడిగే నిజమైన నాయకుడు సీఎం జగన్ అని కొనియాడారు. నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ సచివాలయం, వలంటీరు వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ విప్లవం సృష్టించారన్నారు. డివిజన్ కార్పొరేటర్ వేముల జ్యోతి, వైఎస్సార్ సీపీ నేతలు నూరిఫాతిమా, శ్రీను, పార్టీ నేతలు, కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్‌కు శంకుస్థాపన...

నియోజకవర్గంలోని 14వ డివిజన్ నల్లచెరువు వాకింగ్‌ట్రాక్ పునఃనిర్మాణానికి తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ నిత్యం వాకింగ్ చేసే ప్రతి ఒక్కరికీ ఎంతో ఉపయోగకరంగా ఉండేలా వాకింగ్ ట్రాక్‌ను పునఃనిర్మిస్తున్నట్లు తెలిపారు. నగర మేయర్‌కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ అన్ని హంగులతో వాకింగ్ ట్రాక్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. రూ. 60 లక్షల వ్యయంతో పునఃనిర్మాణ చర్యలు చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, డివిజన్ కార్పొరేటర్లు, పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఆశయాలపై నిబద్ధత కలిగి ఉండాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆశయాలపట్ల నిబద్ధత కలిగినవారే నిజమైన కార్యకర్తలు అని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాల్లో మంగళవారం యూటీఎఫ్ నాయకులు ఎండీ గౌస్, కె.నాగమల్లేశ్వరరావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా వారికి నివాళులర్పించారు. ఈసందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షురాలు బి.ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తుది శ్వాస వరకు గౌస్, నాగమల్లేశ్వరరావు సంఘంలో పని చేయడం అందరికీ ఆదర్శమన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు కె.జోజయ్య, జిల్లా పూర్వ అధ్యక్షుడు జి.ప్రభుదాస్, పూర్వ కోశాధికారి ఎస్. తాండవకృష్ణలు మాట్లాడారు. సీనియర్ నాయకుడు కేఎస్‌వీ దుర్గారావు, రాష్ట్ర ప్రచురణల కమిటీ ఎం.హనుమంతరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. కళాధర్, జిల్లా కోశాధికారి ఎండీ గయాసుద్దౌలా, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మంగళగిరి: అనారోగ్యంతో బాధపడుతున్న ఇరువురికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నగరంలోని జగనన్న కాలనీ టిడ్కో గృహ సముదాయంలో నివాసం ఉంటున్న అందె సాంబశివరావు కొన్నేళ్లుగా మధుమేహ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఇటీవల వైద్యులు ఒక కాలు మోకాలు వరకు తొలగించడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక పద్మశాలీయ నేతల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే పట్టణ వైఎస్సార్ సీపీ నేతల ద్వారా రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నగరంలో తాగునీటి పంపులు ఆపరేట్ చేసే గుంటి జగన్మోహనరావు ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందడంతో వికలాంగురాలైన భార్య ఆర్థికంగా ఇబ్బంది పడుతుందనే విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే వారి కుటుంబ సభ్యులకు పార్టీ నాయకుల ద్వారా రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎమ్మెల్యే ఆర్కేకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేత

నగరంలోని కొత్తపేటకు చెందిన ఐదేళ్ల ఓ చిన్నారికి ఇటీవల గుండె శస్త్ర చికిత్స జరిగింది. తల్లి లక్ష్మి చిల్లర కొట్టులో కూలీ పని చేసుకుంటూ చిన్నారిని పోషించుకోలేకపోతున్నానని స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా సహాయం చేయాలని కోరింది. నేతలు ఆమె సమస్యను ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన బాధిత కుటుంబానికి మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు పార్టీ నేతల ద్వారా అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ మహిళా విభాగం కన్వీనర్ సంకె సునీత, ఎండీ ఫిరోజ్, ఆకురాతి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడికి రిక్షా అందజేత

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని పెనుమాకకు చెందిన రిక్షా కార్మికుడు బొద్దు వసంతరావుకు ఎమ్మెల్యే ఆర్కే సహకారంతో రిక్షాను వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం అందజేశారు. తన జీవనోపాధికి రిక్షాను అందజేసిన ఎమ్మెల్యే ఆర్కేకు వసంతరావు కృతజ్ఞతలు తెలిపారు. రిక్షా అందజేసిన వారికి వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దామేష్ రెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ నాయకులు బొక్కా నాని, వైఎస్సార్ సీపీ నాయకులు భుజంగరావు, బషీర్, అచ్చారావు, మురళి, విజయశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ విద్యావేత్త కన్నా మాస్టారు

కర్నూలు ఎంపీ
డాక్టర్ ఎస్.సంజీవకుమార్



కన్నా మాస్టారు దంపతులను సత్కరిస్తున్న ఎంపీ డాక్టర్ సంజీవకుమార్, ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: పేద, బడుగు, బలహీన వర్గాలకు విద్యాబోధన చేయాలనే ఆసక్తితో వాణిజ్యపన్నుల శాఖలో గ్రూప్-1 స్థాయి అధికారిగా చేస్తున్న ఉద్యోగాన్ని వదులుకుని వచ్చిన కన్నా మాస్టారు ఆదర్శ విద్యావేత్తగా ఎదిగారని కర్నూలు పార్లమెంటు సభ్యుడు డాక్టర్ సింగరి సంజీవకుమార్ పేర్కొన్నారు. ఏఎన్‌యూ దూరవిద్య కేంద్రం ద్వారా విద్యాబోధనపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ పొందిన కన్నా మాస్టారు (విన్నకోట వెంకటేశ్వర్లు) అభినందన సభను మంగళవారం ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ సంజీవకుమార్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులను ఉత్తమమైన పౌరులుగా తీర్చిదిద్దిన తీరు అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ దశాబ్దాలుగా ఎంతో మంది పేదలకు ఉచితంగా, అతి తక్కువ ఫీజులతో విద్యాబోధన చేస్తున్న కన్నా మాస్టారు ఒక రోల్ మోడల్ అని కొనియాడారు. సమాజహితం కోసం విద్యారంగంలో పరిశోధన చేసి డాక్టరేట్ సాధించడం గొప్పవిషయమన్నారు. ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (అపుస్మా) జిల్లా అధ్యక్షుడు పోతిరెడ్డి మాట్లాడుతూ కన్నా మాస్టారు నగర అపుస్మా అధ్యక్షునిగా విశేష సేవలు అందించారని తెలిపారు. హైకోర్టు న్యాయవాది, సామాజిక ఉద్యమ నేత వైకే మాట్లాడుతూ విద్యారంగంతో పాటు పద్మశాలీల సంఘ భవన నిర్మాణానికి రూ.లక్షలాది విరాళాలు ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో హిందూ కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి, నూతలపాటి తిరుపతయ్య, కొండా శివరామిరెడ్డి, డాక్టర్ చంద్రశేఖరరావు, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, గుర్రం చిన వీరయ్య, బి. కైలాష్‌నాథ్, ఆర్.పరమేశ్వరరావు, నగరంలోని పలు విద్యా, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

డెటాల్ తాగి వ్యక్తి మృతి

పెదకాకాని: మద్యం అనుకుని పొరపాటున డెటాల్ తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మరణించిన ఘటన తక్కెళ్ళపాడులో జరిగింది. పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన పెరవలి అబ్రహాం కొంతకాలంగా మానసిక పరిస్థితి సరిగా లేక అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. ఈనెల 7న సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో ఇంటిలో ఉన్న డెటాల్‌ను మద్యంగా భావించి పొరబాటు తాగాడు. గమనించిన అతని కుమారుడు కుమార్ చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. చికిత్స పొందుతున్న అబ్రహాం(56) పరిస్థితి విషమించి మరణించాడు. కుమార్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బందారు సురేష్‌బాబు తెలిపారు.

మద్యం మత్తులో జీవితాలు పాడు చేసుకోవద్దు



మద్యం తాగి ద్విచక్రవాహనం నడిపేవారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ శేషగిరిరావు

తాడేపల్లిరూరల్: మద్యం మత్తులో ద్విచక్రవాహనాలు నడిపి జీవితాలు నాశనం చేసుకోవద్దని తాడేపల్లి సీఐ శేషగిరిరావు అన్నారు. మంగళవారం సాయంత్రం వివిధ ప్రాంతాల్లో మద్యం తాగి ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తున్న 8 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ మద్యం సేవించి ద్విచక్రవాహనాలను, ఇతర వాహనాలను ఇష్టం వచ్చినట్లు నడపడం వల్ల మీ ప్రాణాలతోపాటు, ఎదుటివారి ప్రాణాలు కూడా పోయే అవకాశం ఉందని అన్నారు. మద్యం మత్తులో ద్విచక్రవాహనాలు నడిపి ప్రాణాలు కోల్పోయిన ఎంతో మంది కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యాయని, ఎవరూ మద్యం తాగి వాహనాలు నడపవద్దని అన్నారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, మద్యం తాగి వాహనాలు నడిపినా తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

14 నుంచి హనుమత్ జయంత్యుత్సవాలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో వేంచేసియున్న దక్షిణాముఖ ఆంజనేయస్వామి జయంతి ఉత్సవాలు ఈ నెల 14నుంచి ప్రారంభించనున్నట్లు ఈఓ గాదె రామిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి భక్తులగోత్రనామాలతో పూజలు చేస్తారని చెప్పారు. 11 గంటలకు సువర్చల సమేత ఆంజనేయుడికి కల్యాణం నిర్వహిస్తారన్నారు. భక్తులకు అన్నదానం, సాయంత్రం ఒంటివాహనంపై ద్వాదశ ప్రదక్షిణాలు చేస్తారని తెలిపారు. కార్యక్రమాలను ప్రధాన అర్చకులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణలు నిర్వహిస్తారన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేసిన హైకోర్టు ఏజీపీ



మంగళగిరి: నగరంలోని గ్రంథాలయానికి స్థానిక ఏపీఎస్పీ శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన హైకోర్టు ఏజీపీ అప్పల షణ్ముఖరెడ్డి మంగళవారం న్యాయవ్యవస్థపై అవగాహన కల్పించే పుస్తకాలు, నిరుద్యోగులు, విద్యార్థులకు ఉపయోగపడే పోటీ పరీక్షలకు సంబంధించిన తెలుగు, ఇంగ్లీషు మీడియం పుస్తకాలు 76 లైబ్రేరియన్ ఆరోగ్యంకు అందజేశారు. హైకోర్టు ఏజీపీ షణ్ముఖరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు న్యాయ వ్యవస్థపై, చట్టాలపై అవగాహన కలగాలనే ఉద్దేశంతో పుస్తకాలను అందజేయడం జరిగిందన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పేద, మధ్యతరగతి నిరుద్యోగులు, విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు అందజేశామన్నారు. ప్రజలు, నిరుద్యోగులు, విద్యార్థులు ఉపయోగించుకుని మంచి విజ్ఞానాన్ని పొందాలని ఆయన ఆకాంక్షించారు. భవిష్యత్తులో గ్రంథాలయానికి మరిన్ని పుస్తకాలను అందజేయడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ ప్రాంత పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉండవల్లి అమరావతి కరకట్ట నుంచి కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం వరకు కృష్ణా కరకట్ట ప్రాంతం, కేఎల్ రావు కాలనీ, ఆశ్రమం రోడ్, సీతానగరం ప్రాంతాల్లో అత్యవసర విద్యుత్‌లైన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని కోరారు.